క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుమ్మలక్ష్మీపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఎంపీపీ కుంబురుక దీనమయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తిస్థాయి అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

పోలీసుల రక్తదానం



రక్తదానం చేస్తున్న పోలీసులు

భామిని: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఎస్సై కాంతారావు ఆధ్వర్యంలో బత్తిలి పోలీసులు, యువకులు శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: గిరిజన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎన్.జయకృష్ణ అన్నారు. మండలంలోని పొల్ల గ్రామ సచివాలయం పరిధిలో సోమవారం 'పల్లె పండగ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై వినతులు సేకరించారు. వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సత్యం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తం



యువతకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ

సీతంపేట: రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ఐ సంజీవరావు సూచించారు. స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం యువతకు రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వొద్దని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభకు హాజరైన గ్రామస్తులు, అధికారులు

గరుగుబిల్లి: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఉపతహసీల్దారు డి.సుందరరావు తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన భూముల రీసర్వేలో ఏవైనా తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతోందని, ప్రతీ రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయరు పి.గాంధీ, వీఆర్వో బాలబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల ద్వారానే పనులు

సాలూరు రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను గ్రామ పంచాయతీల ద్వారానే చేపట్టేలా చూడాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, సువ్వాడ రామకృష్ణ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ రమాదేవిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఉపాధి ఏపీఓపై చర్యలు తీసుకోవాలని కోరారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

బలిజిపేట: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థులు తహసీల్దార్ కార్యాయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ రత్నకుమారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సభ్యుడు డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం



నగర పంచాయతీ కార్యాలయం వద్ద పారిశుధ్యలోపం



గేదెలవారి వీధి సమీపంలో పేరుకుపోయిన చెత్త



వినాయక గుడి సమీపంలో ఇలా..

పాలకొండ పట్టణంలో పారిశుధ్యం పడకేసింది. ఎక్కడ చూసినా చెత్తపోగులే కనిపిస్తున్నాయి. పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇటీవల విజయనగరం జిల్లా గుర్ల మండలంలో డయేరియా విజృంభించి పలువురు మృత్యువాతపడినా అధికారుల్లో చలనం రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

– పాలకొండ రూరల్

సచివాలయ ఉద్యోగుల బదిలీతో సేవల్లో అంతరాయం

భామిని: మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో సగం కంటే ఎక్కువ మంది బదిలీపై వెళ్లిపోవడంతో సేవలు సరిగా అందడం లేదని పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే జయకృష్ణ దృష్టికి తీసుకువెళ్లారు.

పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో గ్రామాల వారీగా సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సచివాలయ సేవల్లో అంతరాయంపై కార్యకర్తలు ఎమ్మెల్యేకు వివరించారు. బదిలీపై వెళ్లిన వారి స్థానంలో కొత్తవారిని వెంటనే నియమించి ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు. పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు రవినాయుడు, జగదీశ్వరరావు, ఆనందరావు, జనసేన కన్వీనర్ నిమ్మల నిబ్బరం, రుంకు కిరణ్‌కుమార్‌లు, కార్యకర్తలు న్నారు.

ఈఎంఆర్ఎస్‌లో అరకొర వసతులు

భామిని: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో కొత్తూరు, మల్లిలో నిర్వహిస్తున్న ఈఎంఆర్ఎస్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. భామినిలో సుమారు రూ.12 కోట్ల వ్యాయంతో ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను నిర్మిస్తున్నారు. ఏడేళ్లయినా భవనాలు పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈఎంఆర్ఎస్ బోధనా సిబ్బంది విద్యార్థుల అవస్థలు చూడలేక భామిని ఏకలవ్య పాఠశాల భవనాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేసి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. అరకొర వసతుల మధ్యే పాఠాలు బోధించారు. రెండు నెలలుగా జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓలు పలుమార్లు పాఠశాలను సందర్శించి పనులు త్వరగా పూర్తిచేయాలని సూచించినా సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోలేదు. దీంతో పనులు అరకొరగా పూర్తయ్యాయి. ఇంకా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నవంబర్ 4 నుంచి ధర్నా



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నవంబర్ 4వ తేదీ నుంచి కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడుతున్నట్లు వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వరరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ మేరకు కొంతమంది వీఆర్ఏలతో కలిసి తహసీల్దారు రమణమ్మను మండల కేంద్రంలో కలిసి ధర్నాకు అనుమతి కోరుతూ వినతిపత్రం అందజేశారు. ధర్నాకు వీఆర్ఏలంతా తరలిరావాలని ఆయన కోరారు.

పీజీహెచ్‌ఎంలుగా పదోన్నతి



పదోన్నతి ఉత్తర్వులు ఇస్తున్న పీఓ

సీతంపేట: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఐదుగురికి పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించారు. ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు అందజేశారు. సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలకు వసంతలక్ష్మి, పీఎల్‌పురం పాఠశాలకు మురళి, ఎస్ఎల్‌పురం పాఠశాలకు ఎస్‌వీ ప్రసాద్, దోనుబాయి ఆశ్రమ పాఠశాలకు సుకుమార్, ఎస్ఎస్ మణుగు పాఠశాలకు టి.అబ్బాయిలను నియమించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర, డిప్యూటీఈవో నారాయుడు, ఏఎంవో కోటిబాబు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



ఎమ్మెల్యే జయకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న తప్పెటగుళ్ల కళాకారులు

వీరఘట్టం: తప్పెటగుళ్ల కళకు జీవం పోస్తూ.. తమ పూర్వీకుల నుంచి ఇదే కళను నమ్ముకున్న తమను ఆదుకోవాలని తప్పెటగుళ్ల కళాకారులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను ఎం.రాజపురంలో ఆయన స్వగృహంలో సోమవారం కలిసి తమ సమస్యలను వివరించారు. తప్పెటగుళ్ల కళకు ప్రత్యేక గుర్తింపు వచ్చేలా ప్రభుత్వానికి తమ సమస్యలను వివరించాలని కోరారు. అలాగే తప్పెటగుళ్ల కళాకారులకు పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.

కొత్త ఎక్స్‌రే యంత్రం మంజూరు



ఎక్స్‌రే పరికరాన్ని చూపుతున్న నాగభూషణరావు

పాలకొండ రూరల్: పాలకొండ ఏరియా ఆస్పత్రిలోకి కొత్తగా 300 ఎంఏ ఎక్స్‌రే యంత్రం అందుబాటులోకి వచ్చిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీ నాగభూషణరావు సోమవారం తెలిపారు. దీనిపై మరింత నాణ్యతతో ఎక్స్‌రేలు తీయవచ్చన్నారు. రోగ నిర్ధారణ, చికిత్సకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రోగులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

భామిని: భామిని ఈఎంఆర్ఎస్ భవనంలో మంగళవారం ఏకలవ్య గెస్ట్ టీచర్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, నమూనా బోధన ఉంటాయని సీతంపేట ఐటీడీఏ సిబ్బంది సోమవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భామిని, మెలియాపుట్టి ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్లుకు దరఖాస్తు చేసుకొన్న అభ్యర్థులు హాజరు కావాలని కోరారు. 2024–25 విద్యా సంవత్సరానికి కెమిస్ట్రీ (పీజీటీ), ఫిజిక్స్ (పీజీటీ), మాథ్స్ (పీజీటీ) గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

పార్వతీపురం టౌన్: పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం మున్సిపల్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ, సిబ్బందికి చట్టబద్ధమైన సెలవులు ఇవ్వడంతో పాటు పనిముట్లు, రక్షణ పరికరాలు అందజేయాలని కోరారు. పాలకులు ఎంతమంది మారినా మున్సిపల్ కార్మికుల జీవితాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించని ఎడల భవిష్యత్‌లో ఉద్యమం చేపట్టక తప్పదన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సాలూరు రూరల్: మండలానికి రూ. 3.65 కోట్లతో మంజూరైన అభివృద్ధి పనులకు గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సోమవారం శంకుస్థాపనలు చేశారు. చంద్రప్పవలస నుంచి ముగడవలసకు రోడ్డు..చిన్నవలస కూడలి నుంచి పునికినివలసకు బీటీ రోడ్డు.. కొత్తవలస పంచాయతీ గుండ్రపువలస నుంచి కరాసువలస పంచాయతీకి బీటీ రోడ్డులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలకు పూర్తి స్థాయిలో రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, ఐటీడీఏ డీఈ మణిరాజ్, జేఈ సంతోష్ పాల్గొన్నారు.

పురపాలక సంఘ అభివృద్ధే ధ్యేయం

– ఎమ్మెల్యే విజయ్ చంద్ర

పార్వతీపురం టౌన్: పురపాలక సంఘ అభివృద్ధే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర కోరారు. పార్వతీపురం పురపాలక సంఘ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. పట్టణంలో పారిశుధ్యం, తాగునీటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రతిరోజూ తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏడో రోజూ కొనసాగిన జ్ఞానయజ్ఞం

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి ప్రారంభమైన జ్ఞానయజ్ఞ పూజలు ఏడో రోజైన ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా అర్చకుడు శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ, 20 మంది రుత్విక్కులతో హోమాలు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు



గోశాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్

- పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్

గరుగుబిల్లి: ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ్ హెచ్చరించారు. మండల పరిధిలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించిన ఆయన.. అక్కడి గోసంరక్షణకు అవసరమైన స్థల సేకరణకు సంబంధించి, దేవస్థానం పరిధిలోని భూములను పరిశీలించారు. సర్వే నంబరు135లోని 452 ఎకరాల్లోని నాలుగు ఎకరాల ప్రాంతాన్ని గోసంరక్షణకు కేటాయించేందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేసి అందించాలన్నారు. ఆయన వెంట ఉపతహసీల్దారు డి.సుందరరావు, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో టి.రవికుమార్, సర్వేయరు జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత..

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ యువకులు పలువురు తహసీల్దారు పి.బాలను మండల కేంద్రంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ప్రభుత్వాస్పత్రి, పంచాయతీ కార్యాలయం, రక్షిత మంచినీటి పథకం తదితర ప్రాంతాల్లోని స్థలాలను పలువురు ఆక్రమణదారులు ఇష్టానుసారంగా ఆక్రమించుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే విషయంపై రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు లేవన్నారు. తహసీల్దారు స్పందించి, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, నివేదిక అందించాలని వీఆర్వో రవికుమార్‌ను ఆదేశించారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేసిన తోటపల్లి గ్రామస్తులు

పోరాటాల ఫలితంగానే చట్టాలు



సీపీఎం జెండా ఆవిష్కరిస్తున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అవినాష్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): ఎర్రజెండా పోరాటాల ఫలితంగానే 1/70, పీసా చట్టాలు వచ్చాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోలక అవినాష్ తెలిపారు. కురుపాం మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ, మామిడి మానుగూడ గ్రామంలో సీపీఎం పార్టీ మహాసభలు సోమవారం జరిగాయి. ఆ పార్టీ మండల శాఖ నాయకుడు బిడ్డిక వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలకు ముఖ్య అతిథిగా ఆయన విచ్చేసి, ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి, కాసేపు మాట్లాడారు. మోదీ ప్రభుత్వం గిరిజన చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్‌లకు గిరిజన సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ఎర్రజెండాతో చేసిన పోరాట ఫలితంగానే 2005లో అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం సాధించుకోవడం జరిగిందన్నారు. కానీ నేడు ఆ చట్టాలను ప్రభుత్వాలు నీరుగార్చుతూ గిరిజనులకు ఉండే హక్కులను దూరం చేస్తున్నాయని, ఆ హక్కులు బతికి ఉండాలంటే పోరాటాలే మార్గమని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, కె.చిన్నప్పన్న, కె.రాజారావు, బి.లక్ష్మణరావు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో కురుపాం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శంకరరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పోటీల్లో కురుపాం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో పంటల రోహిత్, కందుల లక్ష్య, కె.సాయికుమార్‌ల బృందం సత్తాచాటి, జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు టి.శంకరరావు సోమవారం తెలిపారు. ఈ మేరకు సదరు విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఎండీఎం కార్మికుల నిరసన



ఎంఆర్‌సీ వద్ద ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులు

సీతంపేట: మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావల రమణారావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి ఎంఆర్‌సీ వరకు సోమవారం ర్యాలీ, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బకాయి వేతనాలు చెల్లించాలని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెనూ బడ్జెట్ పెంచాలని, ప్రమాద బీమా వర్తింపచేయాలని, రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎం.కాంతారావు, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి, విద్యాదీవెన బకాయిలు విడుదల చేయాలి



కురుపాంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ(స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) నాయకులు విద్యార్థులతో కలిసి కురుపాం మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. రావాడ జంక్షన్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు మాట్లాడుతూ పెండింగ్‌లోని రూ.3,480 కోట్ల వసతి, విద్యాదీవెన బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలని, డిగ్రీలో మేజర్, మైనర్ విధానం రద్దు చేయాలని, పార్వతీపురం మన్యం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాల వసతిగృహానికి సొంత భవనం ఏర్పాటు చేయాలని, బాలుర కళాశాల వసతిగృహంలో అదనపు బోరు వేయాలని, చుట్టూ ప్రహరీ నిర్మించాలని, గిరిజన సంక్షేమ వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారు ఎం.రమణమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు.

పెయిన్ కిల్లర్స్ అతిగా వాడితే అనర్థమే



అవగాహన కల్పిస్తున్న ఫిజియోథెరపిస్ట్ రమేష్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): శారీరక నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు వాడే పెయిన్ కిల్లర్స్‌ను ఎక్కువగా వాడితే అనర్థమేనని కురుపాం సీహెచ్‌సీ ఫిజియోథెరపిస్ట్ రమేష్ హెచ్చరించారు. కురుపాం మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో శారీరక నొప్పుల నివారణ చర్యలపై సోమవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చాలామందికి అనారోగ్యం బారిన పడకపోయినప్పటికీ ఒళ్లు నొప్పులు వస్తుంటాయని, ఒకేచోట ఎక్కువసేపు కూర్చున్న వారితో పాటు ఎక్కువ దూరం కారు, బైక్‌లపై వెళ్లే వారిలో కాళ్లు, చేతులు, నడుము నొప్పి వంటి లక్షణాలు బాగా కనిపిస్తాయన్నారు. అలాంటి వారు పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడుతారని, అయితే అది మంచి విధానం కాదన్నారు. యోగా చేయడం ద్వారా గానీ ఫిజియోథెరపీ చేయడం ద్వారా గానీ వాటిని తగ్గించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నాయకుల ఎన్నికల ప్రచారం



ఉపాధ్యాయులతో సమావేశమై మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకుడు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పీఆర్‌టీయూ(ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్) నాయకులు సోమవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరపు సూర్యనారాయణ, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జక్కు రామినాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ తదితరులు కలిసి మండలంలోని నీలకంఠాపురంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు ధర్మలక్ష్మీపురం, లంకాజోడు, జి.శివడ ఆశ్రమ పాఠశాలలు, మొండెంఖల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఉదయం సందర్శించి, అక్కడి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. రానున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడును గెలిపించాలని కోరారు. ఆయనను గెలిపిస్తే సీపీఎస్ రద్దుకు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జయంతిరావు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు కొనియాడారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దిన కార్యక్రమాల్లో భాగంగా కురుపాం మండల కేంద్రంలోని ఏపీ టీడబ్ల్యూహెచ్ పాఠశాలలోని విద్యార్థులకు పోలీసుల విధులు, శాంతిభద్రతల పరిరక్షణలో వారి కృషి, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు–వాటి బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత ఎక్కువగా గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువతీయువకులంతా ఉత్తమ నడవడికతో ఆదర్శవంతమైన పౌరులుగా వెలుగొందాలని ఆకాంక్షించారు. మన భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులు, జవానులను స్మరించుకోవాలని, అదే మనం వారికి ఇచ్చే నిజమైన నివాళి అన్నారు.